క్లుప్తంగా

నేడు ఆర్లిలో మరిడిమాంబ పండగ

కె.కోటపాడు : మండలంలో ఆర్లి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేసినట్టు గ్రామ పెద్దలు తెలిపారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ఏఎల్‌పురంలో వాహన తనిఖీలు చేస్తున్న సీఐ రేవతమ్మ

గొలుగొండ : ఏజెన్సీ నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆదేశించారు. ఆమె బుధవారం కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధిలో ఎక్కడా పేకాట, కోడి పందాలు నిర్వహించకుండా నిత్యం డ్రోన్‌తో నిఘా వేయాలన్నారు. ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణాపై పూర్తి నిఘా ఉంచాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ఎప్పటికప్పుడు పరిశీలన జరపాలని ఎస్‌ఐ తారకేశ్వరావుకు సూచించారు.

పుస్తక పఠనం దినచర్య కావాలి



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు : గ్రంథాలయాల్లో ఎంతో విలువైన మేధాసంపత్తి పుస్తకాల్లో నిక్షిప్తమై ఉన్నట్టు చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రామాయణ, మహాభారత పుస్తకాలను విద్యార్థులతో చదివించే కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. గ్రంథాలయాల్లో గల పుస్తక, పత్రికా పఠనాన్ని దినచర్యగా విద్యార్థులు అలవాటు చేసుకోవాలని పద్మావతి సూచించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నారాయణరావు

నర్సీపట్నం: ఇటీవల మరణించిన యు.రాజుకుమార్ కుటుంబానికి అంతర్జాతీయ వాసవీక్లబ్ వారు ప్రారంభించిన మహాప్రస్థానం కార్యక్రమం ద్వారా రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడు రాజుకుమార్ క్లబ్ సభ్యుడు కావడంతో ఆర్థిక సహాయాన్ని క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ, మహా ప్రస్థానం చైర్మన్ కుమార్, వైస్‌ప్రెసిడెంట్ శ్రీను, గవర్నర్ పార్వతి, రీజినల్ చైర్మన్ నారాయణ అందజేశారు.

ఇనుప వ్యర్థాల బహిరంగ వేలానికి నిర్ణయం

మాడుగుల : స్థానిక మండల పరిషత్‌కు సంబంధించిన ఇనుప వ్యర్థాలు బహిరంగ వేలం వేయాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు ఆరు టన్నుల పాతబోరు విడిభాగాలు, ఇతర ఎనిమిది రకాల ఇనుప వ్యర్థాలను వేలం వేయాలని నిర్ణయించారు. పనికిరాని బోర్ల సామాన్లకు రేట్లు నిర్ణయించి వేలం వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, తహసీల్దారు రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రకాశ్, ఏఈ నాగమల్లేశ్వరి, ఎంపీపీ కార్యాలయం సీనియర్ సహాయకుడు డి.సురేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న పిడుగుపాటు బాధితుడు



ఆస్పత్రిలో గాయాలతో పశువుల కాపరి సూరిబాబు

నాతవరం : పిడుగుపాటుకు తీవ్ర గాయాలైన పశువుల కాపరి బొడ్డు సూరిబాబు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లింగంపేట పంచాయతీ శివారు బుచ్చెంపేట గ్రామానికి చెందిన సూరిబాబు మంగళవారం సాయంత్రం పిడుగు పాటుకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. శరీరం అంతా కాలిపోవడంతో గాయాలు తగ్గే వరకు ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందాలని వైద్యులు సూచించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి జపం... నిధులు పూజ్యం

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఎక్కడికక్కడ నిలిచిన అభివృద్ధి
- అసంపూర్తిగా కాశీపురం-గవరవరం రోడ్డు విస్తరణ పనులు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న 20 గ్రామాల ప్రజలు
- ముందుకు సాగని దేవరాపల్లి పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణం
- ఈ రెండింటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు
- అప్పట్లోనే యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు ప్రారంభం
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణ పనుల్లో జాప్యం



అసంపూర్తిగా నిలిచిన కాశీపురం-గవరవరం రోడ్డు విస్తరణ పనులు



నిలిచిన దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు భవన నిర్మాణ పనులు

దేవరాపల్లి : మండలంలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధుల లేమి కారణంగా అభివృద్ధి పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా గవరవరం- కాశీపురం రోడ్డు విస్తరణ పనులకు బ్రేకులు పడడంతో ఆ మార్గంలో ప్రయాణించే సుమారు 20 గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానంగా మారిన ఈ రోడ్డుతో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను సీఎం జగన్ దృష్టికి అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తీసుకెళ్లగా తక్షణమే స్పందించి రూ.20 కోట్లు నిధులు మంజూరు చేశారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేయడంతో పాటు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభింపచేశారు. అప్పట్లోనే సగానికి పైగా కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునఃప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు నెల రోజులు దాటక ముందే మళ్లీ నిలిచిపోయాయి. దీంతో ఆయా మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఈ పనులు పర్యవేక్షిస్తున్న కె.కోటపాడు ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా బిల్లులు పెండింగ్ ఉండడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోవడం వాస్తవమేనన్నారు. వర్షాలు తగ్గు ముఖం పట్టగానే ప్రారంభించి ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.

అసంపూర్తిగా పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణం

దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడి ఆసుపత్రి పట్ల గతంలో టీడీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్య వైఖరి కనబరచడంతో శిథిలావస్థకు చేరుకొని చిన్నపాటి వర్షానికి ఆస్పత్రి కారిపోయేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించి ప్రస్తుత ఆస్పత్రి భవనం ఆధునికీకరణకు రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయడంతో పాటు అదనపు భవన నిర్మాణానికి రూ.1.70 కోట్లు నిధులు మంజూరు చేశారు. అప్పట్లోనే ఆస్పత్రి అదనపు భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చాక పనులు పునఃప్రారంభించినప్పటికీ కొన్ని రోజులకే మరలా పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతోనే పనులు జాప్యం ఏర్పడుతుందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అదనపు భవన నిర్మాణం పూర్తయితే వసతి సమస్య తీరుతుందని ఎదురు చూస్తున్న స్థానిక ప్రజలకు నిరాశే మిగిలింది.

నిధులు విడుదల కాలేదు



దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు భవన నిర్మాణ పనులకు రూ. 1.70 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. గత ఏడాది మార్చిలో పెట్టిన బిల్లులకు నేటి వరకు నిధులు విడుదల కాలేదు. త్వరలోనే పనులు ప్రారంభింపచేసి, ఐదు లేదా ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– పి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ, దేవరాపల్లి

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

మాకవరపాలెం: సమయపాలన పాటించలేని సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ కోరారు. మండలంలోని తామరం సచివాలయం బుధవారం 12 గంటల వరకు తెరుచుకోలేదన్నారు. దీంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే కాకుండా మండలంలో పలు సచివాలయాలు పర్యవేక్షణ లేక సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల పనితీరుపై పర్యవేక్షణ చేయాలని కోరారు.

కనకదుర్గ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



వాకపల్లిలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామస్తులు

దేవరాపల్లి: వాకపల్లిలో కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. పురోహితులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

31న కేజేపురం కల్యాణ వేంకటేశ్వరునికి పెళ్లిరాట

6న స్వామి వారి కల్యాణోత్సవం



ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు గోడపత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 15 వ వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 31వ తేదీ పెళ్లిరాట కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించి గోడపత్రికను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు సారథ్యంలో విడుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా వచ్చే నెల 5వ తేదీన స్వామి వారి నిజరూపదర్శనం, 6వ తేదీ ఉదయం స్వామి వారి వార్షిక తిరుకల్యాణం జరుగుతుంది. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు.

జూన్ 6వ తేదీన భజన పోటీలు ఏర్పాటు చేసి నగదు బహుమతులు అందజేస్తారు. అలాగే ఆలయం వద్ద ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. 11వ తేదీన నాగవల్లి సంబరాలు, రాత్రికి పుష్పాంజలి సేవ, దర్పణ దర్శనం, పవలింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ జామి ర మణబాబు, ఆలయ కమిటీ సభ్యులు పుట్టా రాంబాబు, యల్లపు రాముతో పాటు శ్రీవారి సేవకులు, ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శనాచార్యులు పాల్గొన్నారు.

చీకట్లో ఉన్నాం.. కరెంటివ్వరూ..!



నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు, కరెంటు వైర్లు

రావికమతం: రావికమతం, వి.మాడుగుల మండలాల సరిహద్దు గ్రామాలైన సామాలమ్మ కొండపై జీలుగులోవ, పశువుల బంద గ్రామాలకు 2024 డిసెంబర్‌లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని పనులు ప్రారంభించారు. ఫిబ్రవరిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు చేశారు. ఏర్పాటు చేసిన నెలలోనే భారీ వర్షాలకు విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. దీనిపై పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆయా గ్రామాల గిరిజనులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కరెంట్ ఇవ్వాలని, లేనిపక్షంలో నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, పీవీటీజీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంపై పునరాలోచించాలి



దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేస్తున్న దేవరాపల్లి మండల వీఆర్‌వోలు

దేవరాపల్లి : గ్రామ రెవెన్యూ అధికారులను క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు ఒక వీఆర్‌వోను నియమిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 4పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని దేవరాపల్లి మండల వీఆర్‌వోల యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి మండల వీఆర్‌వోల యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. క్లస్టర్ విధానంతో మరింత పని ఒత్తిడిలోనై తీవ్ర అనారోగాల బారిన పడే ప్రమాదం ఉందని, గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన ఈ జీవో నుంచి వీఆర్‌వోలను మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వోల యూనియన్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ జగదీష్, కాసప్ప, దొర, రమణమ్మ పాల్గొన్నారు.

తెనాలి ఘటనలో పోలీసులను అరెస్ట్ చేయాలి



మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడె రాజుబాబు

నర్సీపట్నం : తెనాలి ఘటనకు సంబంధించిన పోలీసులపై చట్టరీత్యా తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం మున్సిపాలిటీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆరుగుల్ల రాజుబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత యువకులను విచక్షణరహితంగా కొట్టడం పోలీసులకు తగదన్నారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బతినేలా పోలీసులు వ్యవహరించారన్నారు. పోలీసు దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళిత, మైనార్టీ యువకులను చావగొట్టిన పోలీసు అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోంమంత్రి తక్షణమే కల్పించుకుని ఘటనకు బాధ్యులైన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



చౌడువాడలో శిక్షణ పర్యవేక్షిస్తున్న సురేష్‌బాబు



ఎంపీడీవో కార్యాలయంలో యోగా శిక్షణ

కె.కోటపాడు : యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యగా మార్చుకోవాలని చౌడువాడ పంచాయతీ కార్యదర్శి బి.సురేష్‌బాబు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై సచివాలయ సిబ్బంది, గ్రామ స్థాయి లో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బందికి చౌడువాడ హైస్కూల్లో రెండో రోజు బుధవారం యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, ఎంపీటీసీ రాజేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: యోగాతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో మేరీ రోజ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు.

మాకవరపాలెం: యోగాంధ్రలో భాగంగా వివిధ శాఖల అధికారులకు బుధవారం గిడుతూరులో ఈ శిక్షణ ఇచ్చారు. మరో రెండు రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని ఎంపీడీవో ఛాయాసుధ తెలిపారు.

బుచ్చెయ్యపేట : శారీరక మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో యోగాలో ట్రైనర్స్‌కు శిక్షణ అందించారు. జూన్ 3వ తేదీ నుండి అన్ని సచివాలయాలు వద్ద యోగాలో శిక్షణ అందిస్తారన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

కె.కోటపాడు : బాలింతలు, గర్భినులు పౌష్టికాహారంను తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శైలజ అన్నారు. ఉగ్గినవలస గ్రామంలో బుధవారం ఎఫ్‌పీసీ వైద్య సేవల్లో బాగంగా ఆరోగ్య పరీక్షలను జరిపారు. రెండు గ్రామాల్లో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. గర్భిణులు పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు.

సైనిక పాఠశాలకు జె.నాయుడుపాలెం విద్యార్థి ఎంపిక



మధు

రోలుగుంట : మండలంలోని జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి బి.మధు సైనిక పాఠశాలకు ఎంపికై తమ పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం దాడిశెట్టి రమేష్ కుమార్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో మధు 400కి 328 మార్కులు సాధించి ఎంపికయ్యాడు. దీంతో హెచ్‌ఎంతో పాటు సహచర ఉపాధ్యాయులే మధును, అతనికి శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయుడు కోటేశ్వరరావును అభినందించారు.

62 మందికి వైద్యసేవలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా 62 మందికి వైద్య సేవలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. లీలా ప్రసాద్ రోగులకు బీపీ, సుగర్, ఇతర వ్యాధులు ఉన్నవారికి తనిఖీ చేసి మందులు అందజేశారు. శిబిరంలో ఎంయల్‌హెచ్‌పి లలిత, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన

దేవరాపల్లి: మహిళలు, కిశోర బాలికలు రుతుక్రమ సమయంలో శుచి, శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన సూచించారు. రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరాపల్లి గొల్లపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌వో ఆనంద్, హెచ్‌వి లక్ష్మి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పొంగిన గెడ్డలు..నిండిన చెరువులు



చీడిగుమ్మల వద్ద పొంగి ప్రవహిస్తున్న వరహానది

గొలుగొండ : రెండు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది మేలో ఇంతటి వర్షాలు ఎన్నడూ లేదని ప్రజలు చెబుతున్నారు. భారీ వర్షాలు కారణంగా బొడ్డేరు, పాలగెడ్డ, ధారగెడ్డ, వరహానది నుంచి భారీగా నీరు తాండవ జలాశయానికి చేరుతోంది. తీవ్ర స్థాయిలో ఎండలు ఉండాల్సిన సమయంలో భారీ వర్షాల కారణంగా ప్రజలు పూర్తిగా ఉపశమనం పొందారు. చెరువులు సైతం నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. దీని వల్ల ఈ ఏడాది ముందుగానే ఖరీఫ్ ప్రారంభం అవుతుంది. నారుమడులు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

పాడిరైతులకు పావలా వడ్డీకే రుణాలు



వెటర్నరీ ఏరియా ఆస్పత్రి ఏడీ డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం : పాడి రైతులకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు పశుసంవర్ధకశాఖ నిర్ణయం తీసుకుందని నర్సీపట్నం వెటర్నరీ ఏరియా ఆస్పత్రి ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. రైతులకు లాభసాటిగా ఉన్న పాడిని అభివృద్ధి చేయడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఒక పశువు కలిగి ఉన్న రైతు మరో పశువును కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. మెప్మా, వెలుగు ద్వారా పావలా వడ్డీకి రుణాలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లోని 87 మంది రైతులను గుర్తించామని, వీరందరికీ త్వరలోనే పావలా వడ్డీ రుణాలు అందజేస్తామన్నారు. వడ్డీ భారం లేనందున పాడిని అభివృద్ధి చేసుకుని తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం ద్వారా మరలా తిరిగి రుణం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఆదమరిస్తే అంతే సం‘గోతులు’

- వాహనదారులూ జరభద్రం
- ప్రధానరోడ్డుపై ఆచితూచి వెళ్లాల్సిందే..
- అధ్వానంగా నర్సీపట్నం-కృష్ణదేవిపేట ప్రధానమార్గం



లింగంపేట ప్రధానమార్గంలో పెద్దపెద్ద గోతులు ఉన్న దృశ్యం



ఆరిల్లోవ అటవీప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



ఆరిల్లోవ టవర్ వద్ద రోడ్డు దుస్థితి

గొలుగొండ : నర్సీపట్నం- కృష్ణదేవిపేట మార్గంలో ప్రయాణం చేసే వాహనదారులు ఆచిచూచి వాహనాలు నడపాలి. లేని పక్షంలో ప్రమాదాలకు గురికాక తప్పదు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పలు చోట్ల కల్వర్టులు లేకపోవడం వల్ల వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో కొత్తగా వెళ్లే వాహనదారులకు రోడ్డుపై అవగాహన లేక బోల్తా పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో సుమారుగా రూ. 3 కోట్లుతో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అటవీ అనుమతులు తీసుకువచ్చి కొత్త రోడ్లు వేశారు. కల్వర్టులు వేసే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి, ఆ తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. కొత్త పాలకులు నాలుగుచోట్ల కల్వర్టులు వేయడంలో నిర్లక్ష్యం చూపడంతో రోడ్డు అధ్వానంగా మారింది. తరుచూ ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న నియోజకవర్గంలో ఇటువంటి పరిస్థితి రావడం పట్ల జనం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా లింగంపేట, ఆరిల్లోవ అటవీప్రాంతం, ఆరిల్లోవ టవర్ ప్రాంతంలో ఈ సమస్య అధికంగా ఉంది. వెంటనే ఈ రోడ్డును అభివృద్ధి చేసి వాహనదారుల ఇక్కట్లు తొలగించాలని పలువురు కోరతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

మాడుగుల రూరల్ : దివగంత మాజీ ముఖ్యమంత్రి, దేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతి కార్యక్రమం బుధవారం కె.జె.పురంలో నిర్వహించారు. రామాలయం పక్కన వున్న ఎన్టీఆర్ విగ్రహానికి దేశం నాయకులు పాలకుర్తి శ్రీనివాసరావు, కర్రి నాగమణి, ఆళ్ల శివకుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

నాతవరం : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం దివంగత నేత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు నిర్వహించారు, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్ పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో రావికమతం, టి.అర్జాపురం,దొండపూడి,కొత్తకోట తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, అభిమానులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తకోటలో ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు.